నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, ఆదివారం 23 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI


## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కట్టంగూర్, మార్చి 22 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను శనివారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వరంగల్ సభ విజయవంతంపై కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు చిరుమర్తి తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించినట్లు పేర్కొన్నారు.





బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేసిన ఆలేరు పోలీసులు

## నిరసనలపై నిర్బంధకాండ

- ప్రజా పాలన అంటూనే ఉక్కుపాదం
- సమస్యలపై రోడ్డెక్కితే అరెస్టులు
- చలో అసెంబ్లీ పిలుపులపై గట్టి నిఘా
- ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రజా సంఘాలు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : ప్రజా పాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం నిర్బంధకాండను సాగిస్తున్నది. వివిధ వర్గాల ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, డిమాండ్ల సాధన కోసం పోరాడడం సహజం. ప్రశ్నించడమే తప్పన్నట్టుగా, నిలదీతలు నేరమన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. ఎక్కడ ఎవరు సమస్యలపై గొంతెత్తినా, రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసినా సహించలేక పోతున్నది. ఈ నెల 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా, తమ సమస్యల పరిష్కారానికి ఇదే తమకు సమయమని భావించి ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు ఉద్యమాలకు పిలుపునిచ్చాయి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి వివిధ వర్గాల ప్రజలు చలో అసెంబ్లీకి సిద్ధమయ్యారు. కానీ, ప్రభుత్వం పోలీసు యంత్రాంగం ద్వారా ఎక్కడికక్కడ నిర్బంధం ప్రయోగిస్తున్నది. తెల్లవారుజాము నుంచే ఆయా వర్గాల నాయకులను ఇండ్ల వద్దే అదుపులోకి తీసుకుంటున్నారు. వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించి సాయంత్రం వరకు స్టేషన్లలోనే ఉంచుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు మొదలైన తొలి రోజునే మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లులను చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు. దఫదఫాలుగా అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించగా ప్రతిసారీ పోలీసులు నిర్బంధకాండ సాగిస్తున్నారు. ఇక బడ్జెట్ కేటాయింపుల్లోనూ అన్యాయం జరిగిందంటూ వివిధ వర్గాలు నిరసనలకు పిలుపునిచ్చాయి. విద్యారంగానికి సరైన నిధులు కేటాయించలేదని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ పిలుపునివ్వగా ఆ విద్యార్థి సంఘం నాయకులను శుక్ర, శనివారాల్లో ఎక్కడికక్కడ అరెస్టు చేసి, స్టేషన్లకు తరలించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్ట్ హమాలీలు, సెక్యూరిటీ గార్డుల వంటి అసంఘటిత కార్మికులు తమకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి చలో ఇందిరా పార్కు ధర్నాకు సిద్ధమవగా, శుక్రవారం వారినీ అన్ని చోట్లా నిర్బంధించారు. సమస్యల పరిష్కారం కోసం చలో అసంబ్లీకి సిద్ధమైన మత్స్యకార్మికుల పైనా అరెస్టుల పర్వం సాగింది. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్వీ శనివారం చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, పెద్దవూర, త్రిపురారం, నకిరేకల్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి, తిరుమలగిరి, అర్వపల్లి, నాగారం, చివ్వెంల, పెనపహాడ్, సంస్థాన్‌నారాయణపురం, రాజాపేట, ఆలేరు, తుర్కపల్లి తదితర మండలాల్లో ఎక్కడికక్కడ ఆ సంఘం నాయకులను పోలీసులు అరెస్టులు చేశారు. కాగా ప్రభుత్వ నిర్బంధకాండపై కార్మిక, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు కాంగ్రెస్ నేతలు ఇలాంటి అరెస్టులను ఖండిస్తూ, తాము అధికారంలోకి వస్తే ప్రజా పాలన అందిస్తామని గొప్పలు చెప్పి.. కొద్ది రోజుల్లోనే ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతుండడాన్ని తప్పు పడుతున్నారు. ప్రజా పాలన అంటూనే ప్రజల గొంతు నొక్కే చర్యలు మానుకోవాలంటూ హితువు పలుకుతున్నారు.

# తాగునీటికి ప్రమాద ఘంటికలు

## భూగర్భ జలాలు అడుగంటి ఎండిపోతున్న బోర్లు

### రిజర్వాయర్ల ద్వారా సరిపడా అందని జలాలు

- హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి వస్తున్నది 47ఎంఎల్‌డీలే..
- జిల్లాలో 167 ఆవాసాలకు నీటి ఎద్దడి ముప్పు
- వారానికి రెండు సార్లే నీటి సరఫరా.. వాటర్ ట్యాంకర్లే దిక్కు
- తాగడానికి ప్రైవేట్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్న జనం
- మున్ముందు పరిస్థితి ఏంటోనని ఆందోళన

**వేసవి ఇంకా మొదలు కాలేదు.. ఎండలు ముదరనే లేదు. అప్పడే తాగునీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నీటి ఎద్దడి ముంచుకొస్తుండడంతో పల్లెలు, పట్టణాల్లో జనం అవస్థలు మొదలయ్యాయి. రిజర్వాయర్ల నుంచి వచ్చే నీళ్లు సగానికి పడిపోయాయి. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు వేగంగా వట్టిపోతున్నాయి. అనేక గ్రామాలు, పట్టణాల్లో వారానికి రెండు సార్లు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. దాంతో వాటర్ ట్యాంకర్ల కోసం నిరీక్షించక తప్పడం లేదు. ఇప్పడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

– యాదాద్రి భువనగిరి, మార్చి 21 (నమస్తే తెలంగాణ)

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు, 719 ఆవాసాలు ఉన్నాయి. మొత్తంగా 1,56,147 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,221 ట్యాంకులు, 353 చేతి పంపులు, 33 బావుల ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లోని 512 ఆవాసాలకు హైదరాబాద్ మెట్రో వాటర్ గ్రిడ్ నుంచి, 131 ఆవాసాలకు అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, 69 ప్రాంతాలకు నల్లగొండలోని ఉదయసముద్రం నుంచి తాగునీరు సరఫరా అవుతున్నది. హెచ్ఎండబ్ల్యూస్ నుంచి ప్రజల కోసం రోజుకు 80ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్ డే) నీరు అవసరం. గతంలో సుమారుగా ఇదే స్థాయిలో నీరు సరఫరా అయ్యేది. కానీ ప్రస్తుతం 47 ఎంఎల్‌డీలు మాత్ర మే జిల్లాకు వస్తున్నాయి. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల్లోని 144 ఆవాసాలకు నల్లగొండ జిల్లాలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 14 ఎంఎల్‌డీల జలాలు అందుతున్నాయి. రామన్నపేట, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లోని ఆవాసాల్లోకి పానగల్ రిజర్వాయర్ నుంచి 10 ఎంఎల్‌డీల కృష్ణానీటిని అందిస్తున్నారు. ఇవి కూడా అంతంతమాత్రంగా నే వస్తున్నాయి. మొత్తంగా గతంలో పోలిస్తే ప్రస్తుతం సగం నీరు మాత్రమే జిల్లాకు సరఫరా అవుతున్నది.

### అప్పడే నీటి కష్టాలు..

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి నీటి బాధలు షురూ అయ్యాయి. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో ఇబ్బందులు విపరీతంగా ఉన్నాయి. సరిపడా నీళ్లు లేకపోకపోవడంతో మిషన్ భగీరథ నీళ్లలోనే స్థానిక బోరు నీళ్లను కలిపి సరఫరా చేస్తున్నారు. అది కూడా వారానికి రెండు సార్లు మాత్రమే అందిస్తున్నారు. కొన్నిచోట్ల నీటి సరఫరా లేకపోవడంతో వాటర్ ట్యాంకర్లే దిక్కవుతున్నాయి. కాలనీల్లో ట్యాంకర్ల నుంచి పట్టుకొని డ్రమ్ముల్లో నింపుకొంటున్నారు. ఇవి కనీస అవసరాలకు కూడా చాలకపోవడంతో ఎప్పుడో వచ్చే వాటర్ ట్యాంకర్ల కోసం పడిగాపులు గాయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొందరు డబ్బులు వెచ్చించి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. భువనగిరి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ట్రాక్టర్ల ద్వారా అందించే ట్యాంకర్ నీళ్లే ఆధారం అయ్యాయి. ఇక్కడ రెండు వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారాయి.

**167 ఆవాసాల్లో..**

జిల్లాల 167 ఆవాసాలకు నీటి ఎద్దడి ఉందని అధికారులు అంచనా వేశారు. చాలా గ్రామాల్లో నీళ్ల కోసం ప్రజలు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. అక్కడికే వెళ్లి బట్టలను ఉతుక్కుంటున్నారు. గ్రామాలు, తండాల్లో కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. మళ్లీ ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. మిషన్ భగీరథ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో జనం వాటర్ ప్లాంట్లలో నీటిని కొనుగోలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు.

### వట్టిపోయిన బోర్లు

జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. ఫిబ్రవరిలో సగటున 10.95 మీటర్ల కిందకు వెళ్లాయి. గతంలో సగటున ఐదు మీటర్ల లోతులోనే నీళ్లు ఉండగా, ఇప్పుడు వేగంగా అడుగంటుతున్నాయి. గతేడాది కంటే ఈసారి 2.36 మీటర్ల మేర అధికంగా పడిపోయాయి. జిల్లాలోని 17 మండలాల్లో భూగర్భ జలమట్టం తగ్గిపోయింది. సంస్థాన్ నారాయణపురంలో అత్యధికంగా 23.09 మీటర్ల లోతులో నీళ్లు ఉన్నాయి. ఆత్మకూరు(ఎం)లో 18.18 మీటర్లు, బొమ్మలరామారంలో 14.06, భువనగిరిలో 12.61, రామన్నపేటలో 12.36, బీబీనగర్‌లో 12.31, ఆలేరులో 11.96, తుర్కపల్లిలో 11.76, మోటకొండూరులో 11.36 మీటర్ల దూరాన నీళ్లు ఉన్నాయి. దాంతో బోర్లు, బావులు ఎండిపోయి తాగు నీటి ఎద్దడి జఠిలంగా మారుతున్నది.



“ ప్రైవేట్ ట్యాంకర్ ద్వారా నీళ్లు పోయించుకున్న ఈ వ్యక్తి పేరు కానుగు శివ. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని హనుమాన్‌నగర్. తమ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, పది రోజులకోసారి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. అది కూడా చాలా సన్నగా వస్తున్నాయని, అధికారులకు చెప్పిచెప్పి యాష్టకొచ్చిందని వాపోయారు. దాంతో ప్రైవేట్ ట్యాంకర్ ద్వారా నీళ్లు పోయించుకుంటున్నట్లు పేర్కొన్నారు. నీటి సమస్య కారణంగా అద్దెకు ఉన్న వాళ్లు కూడా ఖాళీ చేస్తున్నారని, కొత్తగా ఎవరూ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో నీళ్లకు ఇబ్బంది లేదని, ఇప్పడు సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు.

– చౌటుప్పల్, మార్చి 22

## మూడు రోజులకోసారి నీళ్లు.. అవీ మూడు బిందెలే...

### మోత్కూరులో తాగునీటి ఇక్కట్లు

మోత్కూరు : నల్లగొండలోని పానగల్ ఉదయసముద్రం మిషన్ భగీరథ పంప్‌హౌస్ నుంచి మోత్కూరు మున్సిపాలిటీ పరిధి బుజిలాపురంలోని సంపునకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక్కడి నుంచి మోత్కూరు మున్సిపాలిటీతోపాటు మండలంలోని 10 గ్రామాలకు, అడ్డగూడూరు మండలంలోని 17 గ్రామాలకు మంచినీటి సరఫరా అవుతుంది. కాగా వేసవి నేపథ్యంలో నీటి నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నీటి సరఫరా అంతంతమాత్రంగానే అవుతున్నది. దాంతో మున్సిపాలిటీతోపాటు ఆయా గ్రామాల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మోత్కూరుకు చెందిన గౌళికర్ స్వరూప అనే మహిళ మాట్లాడుతూ.. మూడు రోజుల కోసారి నీటిని సరఫరా చేస్తున్నారని, అవి కూడా మూడు బిందెలు నిండడం లేదని తెలిపారు. నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.



స్వరూప



మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో పడిగాపులు పడి నల్లాల వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు



భువనగిరి సబ్ జైల్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

## సబ్ జైలును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

భువనగిరి అర్బన్, మార్చి 22 : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు శనివారం భువనగిరి సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో ముఖాముఖి జరిపి అర్హులైన వారికి న్యాయ సహాయం అందించాలని జైలు సూపరింటెండెంట్ నెహ్రూకు సూచించారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత ఉన్నారు.

## చౌటుప్పల్‌లో నీటి గోస

- రోజుల తరబడి ఎదురుచూపులు
- ట్యాంకర్ నీళ్లు కొనుగోలు చేస్తున్న పట్టణ ప్రజలు

చౌటుప్పల్, మార్చి 22 : చౌటుప్పల్ మున్సిపాలిటీలోని హనుమాన్‌నగర్, రత్నానగర్, బంగారిగడ్డ కాలనీల్లో తాగు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ లోపం కారణంగా ఈ కాలనీలకు రెండు వారాలకోసారి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. అవి కూడా పావు గంటకు మించి ఇవ్వడం లేదని స్థానికులు వాపోతున్నారు. హనుమాన్‌నగర్‌లో నీటి కోసం వేసిన బోర్లు సైతం వట్టిపోయాయి. నీళ్లు లేకపోవడంతో అద్దె ఇండ్లల్లో ఉంటున్న వాళ్లు ఖాళీ చేస్తున్నారు. ప్రతి ఇంటికీ డబ్బులు వెచ్చించి వారానికోసారి ప్రైవేట్ ట్యాంకర్ నీళ్లు పోయించుకున్నట్లు కాలనీ వాసులు చెప్తున్నారు. నీళ్లు లేకపోవడంతో అద్దెకు కూడా ఎవరూ రావడం లేదని, లక్షల రూపాయలు అప్పులు చేసి కట్టుకున్న ఇండ్లకు బ్యాంకు ఈఎంఐలు చెల్లించకపోతున్నామని పలువురు వాపోతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చౌటుప్పల్‌లో తాగునీటికి తీవ్ర సమస్య ఉండగా, కేసీఆర్ సర్కారు ఇక్కడి నుంచే మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒక్క చౌటుప్పల్ మున్సిపాలిటీకే రూ.25లక్షలు వెచ్చించి ఇంటింటికీ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసింది. వేసవి సమయంలో నీటిని ఎక్కువగా వదలడంతో ఎన్నడూ ఎద్దడి ఏర్పడలేదు. మిషన్ కాకతీయ కారణంగా భూగర్భజలాలు కూడా పెరిగి బోర్లలోనూ గృహ అవసరాలకు నీళ్లు పుష్కలంగా ఉండేవి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపు లేని కారణంగా మళ్లీ తాగునీటి సమస్య మొదలైందని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. బంగారిగడ్డకు చెందిన సుర్కంటి లావణ్య మాట్లాడుతూ నల్లా నీళ్లు వచ్చి 20 రోజులైందని వాపోయారు. వచ్చినా 15నిమిషాలకు మించి రావడం లేదని తెలిపారు. దాంతో దినం తప్పించి దినం 180 రూపాయలు ఇచ్చి ట్యాంకర్ ద్వారా మూడు డమ్ముల నీళ్లు పోయించుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు.



బంగారిగడ్డలో ట్యాంకర్ నీళ్ల కోసం ఇంటి ముందు డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్న సుర్కంటి లావణ్య

### కలెక్టర్ వచ్చిన ఒక్క రోజే ట్యాంకర్ తిప్పిండ్రు



ఈ మధ్య కలెక్టర్ సారు పర్యటనకు వచ్చిన ఒక్క రోజు మాత్రమే మా కాలనీలో ట్యాంకర్ తిప్పిండ్రు. తర్వాత ఇటు సైడు రానేలేదు. రోజు మూడు డ్రమ్ముల నీళ్లు కొంటున్నాం. ఆ నీళ్లు కూడా పైన తెల్లగ పేరుకుంటున్నయి. అధికారులు పట్టించుకుని నీళ్ల బాధ తీర్చాలి.

-ఎండీ ఫర్జానా, బంగారిగడ్డ, చౌటుప్పల్



మోత్కూరులో నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు

## చేనేత బడ్జెట్‌ను సవరించాలని నేతన్నల ఆందోళన

మోత్కూరు, మార్చి 22 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం మోత్కూరులో ఆందోళన చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి, ప్రభుత్వ వైఖరి పట్ల నిరసన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం పాటు పడుతామని చెప్పి ఇప్పుడు బడ్జెట్‌లో కేవలం రూ.371 కోట్లు మాత్రమే కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బడ్జెట్‌ను సవరించి కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోచం కన్నయ్య, నాయకులు పి యాదయ్య, తాటి లక్ష్మణ్, రేగటి శ్రీనివాస్, పసునూరి రమేశ్, రవి, నర్సింహ, సోమయ్య, హరినాథ్, అంబదాస్ పాల్గొన్నారు.

## పేదల బతుకుదెరువుపై ప్రతాపం

### నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణాల కూల్చివేత

- ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న షాపుల ధ్వంసం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

**బతుకుదెరువు లేక ఉపాధి కోసం స్వశక్తితో రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసుకున్న డబ్బాలను రెవెన్యూ అధికారులు తెల్లవారుజామున జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ ఘటన మండలంలోని వడపర్తి గ్రామ సమీపంలో శనివారం నెలకొంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధిలోని భువనగిరి - తుర్కపల్లి ప్రధాన రహదారికి ఇరువైరులా ఉన్న ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన పలువురు చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణలకు గురిచేస్తున్నారని నిర్మాణాలను తొలగించారు. జీవనోపాధి కోసం అప్పులు చేసి ఏర్పాటు చేసుకున్న డబ్బాలను ఒక్కసారిగా తొలగించడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

– భువనగిరి కలెక్టరేట్, మార్చి 22

ఎన్నో ఏండ్లుగా పంటలు పండించేందుకు సరిపడా నీళ్లు లేక, ఎన్ని బోర్లు వేసినా ప్రయోజనం కనిపించకపోవడంతో పంట భూములను పడావు పెట్టారు. 1956నుంచి అసైన్డ్ భూముల్లో ఉన్న రైతులు, వారి కుటుంబాలకు చెందిన కొందరు జీవనోపాధి కోసం సంవత్సరం ముందు రోడ్డు వెంట ఉపాధి కోసం డబ్బాలను ఏర్పాటు చేసుకొని బతుకు నెట్టుకొస్తున్నారు. జీవనోపాధిలో భాగంగా హోటల్, ఫర్నీచర్ షాపు, దానా దుకాణం, రియల్ ఎస్టేట్, ఇటుకల తయారీ, సీటు కవర్ల దుకాణం, కూల్‌డ్రింక్స్ తదితర షాపులను ఏర్పరుచుకుని కొన్ని రోజులుగా ఉపాధి పొందుతున్నారు. ఐదు రోజుల క్రితం అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి నేతృత్వంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని పరిశీలించేందుకు వచ్చారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న డబ్బాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దాంతో సంబంధిత శాఖ అధికారులు ఆక్రమణలను తొలగించాలని చెప్పడంతో బాధితులు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వద్దకు వెళ్లి సమస్యను వివరించారు. బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో బాధితులు లబోదిబోమంటూ విలపిస్తున్నారు.



రెవెన్యూ అధికారులు ధ్వంసం చేసిన నిర్మాణాల ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

### కుటుంబమంతా రోడ్డున పడ్డాం



గత సంవత్సరం పైసా పైసా కూడబెట్టుకుని, అందిన కాడల్లా అప్పులు చేసి ఫర్నీచర్ షాపు ఏర్పాటు చేసుకున్నాం. కుటుంబమంతా ఇక్కడే పనిచేస్తున్నాం. జీవనోపాధి కోసం ప్రభుత్వ భూమిలో షాపు ఏర్పాటు చేసుకుంటే తెల్లవారుజామున జేసీబీతో కూల్చేశారు. ప్రభుత్వం నిరుపేదలను ఆదుకోవాలి.

- జమ్మని హేమలత, ఫర్నిచర్ షాపు నిర్వాహకురాలు

### పైఅధికారుల ఆదేశాల మేరకే కూల్చివేతలు : ఆర్ఐ భద్రయ్య

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు పైఅధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలు, డబ్బాలను తొలగించాం. గత నెల 18న ప్రభుత్వ స్థల పరిశీలనకు వచ్చిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి అక్రమ నిర్మాణాలపై ఆగ్రహించారు. నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం నిర్మాణాల తొలగింపు చేపట్టాం.

### నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేత

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టి జీవనోపాధి పొందుతున్న బాధితులకు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారు. బతుకుదెరువు కోసం ఎంతో కష్టపడి అప్పులు చేసి నిర్మాణాలు చేసుకుంటే తెల్లవారుజామున ఎవరూ లేని సమయంలో కూల్చివేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని బాధితులు, స్థానికులు పేర్కొంటున్నారు.

## చిరు వ్యాపారుల డబ్బాలు కూల్చి వేయించవద్దు

- పీసీసీ ప్రధాన కార్యదర్శి పొత్నాక్ ప్రమోద్‌కుమార్

భువనగిరి అర్బన్ : పేదలు జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న డబ్బాలను కూల్చి వేయించవద్దని పీసీసీ ప్రధాన కార్యదర్శి పొత్నాక్ ప్రమోద్‌కుమార్ కోరారు. కూల్చివేతలను ఆపాలని ఆర్డీఓ కృష్ణారెడ్డికి వడపర్తి గ్రామ మాజీ సర్పంచ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి, దళిత సంఘాల జిల్లా అధ్యక్షుడు బట్టు రాంచంద్రయ్య, బాధితులతో కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం ఎస్సీలకు భూములు ఇచ్చి వాటికి పట్టాతో పాటు పాస్ పుస్తకాలు అందజేసిందన్నారు. ఇటీవల బస్వాపురం రిజర్వాయర్‌లో ఎస్సీల భూములు ముంపునకు గురికావడంతో చిన్న డబ్బాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఒక్కసారిగా నిర్మాణాలను కూల్చి వేయించడంతో పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వారికిచ్చిన భూముల్లో చిరు వ్యాపారాలు నిర్వహించుకునేలా అనుమతించాలని కోరారు.

### నాడు ఎమ్మెల్యే చేతులమీదుగానే ప్రారంభం



గత సంవత్సరం ముగ్గురం స్నేహితులం కలిసి రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ఆ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి 2024 జనవరి 6న ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు నిర్మాణాలను తొలగించాలని చెప్పిన విషయాన్ని బాధితులతో కలిసి ఎమ్మెల్యేకు చెప్పాం. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. స్వశక్తితో ఎదుగాలనే సంకల్పంతో యువకులం ఏర్పాటు చేసుకున్న కార్యాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు.

- బొబ్బిలి జగత్, బాధితుడు, వడపర్తి